క్లుప్తంగా

సబ్సిడీ యూనిట్లకు దరఖాస్తు

బల్లికురవ: రైతులు, గొర్రెల పెంపకందార్లు సబ్సిడీ యూనిట్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి పీ. మహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కింద 50 శాతం రాయితీపై గొర్రెలు, పొట్టేళ్ల యూనిట్లు పొందవచ్చన్నారు. రైతు 10 శాతం చెల్లిస్తే బ్యాంకు 40 శాతం రుణం అందజేయాలన్నారు. 100 గొర్రెలు, 5 పొట్టేళ్లకు కోటి వరకు పొందవచ్చని ముందుగా బ్యాంకర్లతో మాట్లాడుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. గేదెలు, ఆవులు షెడ్డు నిర్మాణానికి 90 శాతం సబ్సిడీపై రెండు, నాలుగు, ఆరు పశువులకు యూనిట్లు అందిస్తామన్నారు. 10 శాతం రైతు వాటా చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్డు నిర్మాణానికి 70 శాతం సబ్సిడీపై 20, 50 గొర్రెలు 100 నుంచి 200 కోళ్లు ఉండేందుకు షెడ్లు అర్హులకు అందిస్తామని ఇందులో 30 శాతం వాటా చెల్లించాలని వివరించారు.

విద్యుత్ తీగ తెగిపడి గేదె మృతి

బల్లికురవ: వర్షం, గాలి ఉధృతికి విద్యుత్ సప్లయ్ వైరు తెగి గేదెపై పడటంతో షాక్‌కుగురై అక్కడికక్కడే చనిపోయింది. ఈఘటన శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని చినఅంబడిపూడి గ్రామంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు గంగవరపు ఆదినారాయణ తన గేదెలను పశువుల పాక ముందు ఆరుబయట కట్టివేశారు. వర్షం గాలి ఉధృతికి గ్రామానికి సరఫరా ఇచ్చే విద్యుత్ సప్లయ్ వైరు తెగి గేదెపై పడింది. ఉదయం పశువుల శాల వద్దకు వెళ్లిన రైతు నిర్జీవంగా పడివున్న గేదె పైన పడిన విద్యుత్ వైర్లు చూసి వెంటనే ఆశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి తెగిన వైరును సరిచేశారు. చనిపోయిన గేదె విలువ లక్ష పైచిలుకు ఉంటుందని బాధిత రైతు వాపోయారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అద్దంకి రూరల్: రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం రాత్రి అద్దంకిలోని భవాని సెంటర్ నుంచి దర్శి రోడ్డులో నడుచుకుంటూ వెళుతున్న గుర్తు తెలియని (37) వ్యక్తిని ఆటో ఢీకొట్టి వెళ్లింది. దీంతో తీవ్రగాయాలైన వ్యక్తిని స్థానికులు 108 ద్వారా అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు రిమ్స్ నుంచి అద్దంకి స్టేషన్‌కు రిపోర్టు అందిందని ఎస్సై తెలిపారు.

బియ్యం ధరలకు రెక్కలు..?

- నెలనెలా పైపైకి పోతున్న ధరలు
- బెంబేలెత్తుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు
- ఆందోళనలో అన్నదాతలు

గతేడాది..	ఈ ఏడాది..
సాగు సుమారు 80 వేల ఎకరాలు	సాగు సుమారు 1 లక్ష ఎకరాలు
ధాన్య దిగుబడి సుమారు 2 లక్షల క్వింటాలు	సుమారు 2.80 లక్షల క్వింటాలు
ధాన్యం ధరలు క్వింటా రూ.1500	ధాన్యం ధరలు క్వింటా రూ.1900
బియ్యం ధరలు..	
గతేడాది..	ఈ ఏడాది..
బీపీటీ–25 కేజీలు రూ.1250	బీపీటీ–25 కేజీలు రూ.1600
92 రకం–25 కేజీలు రూ.1100	92 రకం–25 కేజీలు రూ.1500
2270 రకం–25 కేజీలు రూ.1000	2270 రకం–25 కేజీలు రూ.1250



అమ్మకాలకు సిద్ధంగా ఉన్న బియ్యం బస్తాలు

కారంచేడు: కడుపునిండా అన్నం తినాలంటే బియ్యం ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండాలి. కాని నెలనెలా వాటి ధరలకు రెక్కలు వస్తున్నాయి. దీంతో బియ్యం ధరలు మార్కెట్‌లో పైపైకి ఎగబాకుతున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తుతుంటే ఉద్యోగులు పెరుగుతున్న ధరలను చూచి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా బియ్యం ధరలు పెరుగుతుంటే ఎలా కొనుక్కోవాలని వారు ప్రశ్నిస్తున్నారు.

అన్నదాతల కొంపముంచిన గతేడాది తుఫాన్..

జిల్లా ధాన్యగారంగా పేరొందిన కారంచేడు ప్రాంతంలో గత ఏడాది మాగాణి సాగు వాతావరణ పరిస్థితుల్లో పంటల దిగుబడి చాలా వరకు తగ్గిపోయింది. నార్లు పోసుకొని, పంటలు డబ్బు కట్టే సమయంలో వచ్చిన తుఫాన్, ఆ కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదలతో ప్రధాన సాగు నీటి వనరులుగా ఉన్న కొమ్మమూరు కాలువతో పాటు, సాగర్ కాలువకు అనుసంధానంగా ఉన్న కప్పలవాగు సైతం కట్టలు తెంచుకొని ప్రవహించాయి. దీంతో పంట చేలు నీట మునిగాయి. ఈ ప్రభావం పంటల దిగుబడిపై పడటంతో అన్నదాతలు చాలా వరకు నష్టపోయారు. ఈ ప్రాంతంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. అన్నదాతల ముంగిట ఎప్పుడూ ధాన్యం రాశులు దర్శనమిచ్చేవి. ఆ ప్రభావం ఇప్పుడు బియ్యం ధరలపై కనిపిస్తుందని బియ్యం మిల్లర్లు, వ్యాపారులు చెప్తున్నారు. పర్చూరు, కారంచేడు, చీరాల, వేటపాలెం, చినగంజాం, సంతరావూరు, ఇంకొల్లు మండలాల పరిధిలో కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద సాగు చేసేవారు.

బియ్యం ధరలు ఆకాశన్నంటుతున్నాయి..

ప్రస్తుతం బియ్యం ధరలు బాగా పెరిగిపోయాయి. గతంలో ఎన్నడూ ఇంత ఎక్కువ ధరలు లేవు. గతేడాది 25 కేజీల బియ్యం బస్తా రూ.1250 ఉంటే, ఈ ఏడాది అదే బియ్యం బస్తా రూ.1600లకు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిరుద్యోగులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు.

– ఎస్ సత్యన్నారాయణ, స్వర్ణ

బియ్యం ధరలు అదుపు చేయాలి..

బియ్యం ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వంగాని, అధికారులుగాని వీటిని అదుపు చేయాల్సి ఉంది. కేజీ రూ.55ల వరకు ఉంది. ఒక కుటుంబంలో రోజుకు రెండు కేజీల చొప్పున బియ్యం ఖర్చు కేజీ రూ.110 వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. సగటున నెలకు బియ్యానికి రూ.3500 ఖర్చు అవుతుంది.

– బీ భాస్కరరావు, కారంచేడు

విద్యుత్ అంతరాయాలను తగ్గించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి రూరల్: విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు సిబ్బంది అన్ని విద్యుత్ లైన్‌లను తరచుగా పరిశీలించాలని విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు అన్నారు. శనివారం స్థానిక గీతామందిరంలో విద్యుత్ శాఖ డివిజన్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ డివిజన్ స్థాయిలోని సిబ్బంది ప్రతిఒక్కరూ పూర్తిస్థాయిలో క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల కోసం దరఖాస్తులు పెట్టుకున్న రైతులకు వీలైనంత త్వరగా అంచనాలు తయారుచేసి పంపాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ కనెక్షన్‌ల మంజూరు కోసం రైతులు ఎవరికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈ టి. సత్యనారాయణ, డీఈఈ మార్టూరు సురేంద్రబాబు, ఏఈలు, ఏఏవోలు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కారంచేడు పోలేరమ్మ తల్లి కొలుపులు


పోలేరమ్మతల్లి

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించే ఈ కొలుపుల్లో గ్రామదేవతకు తలంట్లు, పొంగళ్లు, నైవేద్యాలు సమర్పిస్తారు. రాత్రికి అమ్మవారి చిత్రపటాన్ని ప్రత్యేకంగా సిద్ధం చేసిన ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈఉత్సవంలో కనకతప్పెట్లు, బాణాసంచాలతో యువతీ, యువకులు, పెద్ద, చిన్న, మహిళలు అనే తేడా లేకుండా అమ్మవారి ముందు వీరతాళ్లతో నృత్యాలు చేస్తారు. తమ మొక్కుబడులు తీర్చుకుంటారు. ఈకొలుపులను ప్రతి ఏటా వ్యవసాయ పంటల సాగుకు ముందు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఈ ఏడాది మొదటిసారిగా మాస్కో బజారుకు చెందినవారు ఈ కొలుపుల నిర్వహణకు నడుం బిగించారు. సాగు చేసే పంటలు బాగా పండాలని, వర్షాలు కురవాలని, మంచి దిగుబడులతో అన్నదాతలు, గ్రామస్తులు సంతోషంగా ఉండాలని పూజిస్తూ కొలుపులు నిర్వహించడం దశాబ్దాలుగా వస్తుందని గ్రామస్తులు చెప్తున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులతో పాటు, మాస్కో బజారు యువతీ, యువకులు, ప్రజలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ద్రోణి ప్రభావంతో చిరు జల్లులు


బల్లికురవలో కురుస్తున్న వర్షం


చీరాల ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు

బల్లికురవ: అల్పపీడన ద్రోణి ప్రభావంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి మండలంలో చిరుజల్లులతో వర్షం కురుస్తోంది. గత పది రోజులుగా ఎండల ఉధృతితో విలవిల్లాడుతున్న వృద్ధులు, చిన్నారులకు వాతావరణం చల్లబడి, చిరుజల్లులు పడుతుండటంతో కొంత మేర ఉపశమనం లభించింది. మెట్ట, మాగాణి భూముల్లో సాగుచేసిన పచ్చిరొట్ట పైర్లయిన జనుము, జీలుగ, పిల్లిపెసర బోర్లకింద సాగుచేసిన కూరగాయాల పైర్లు ఈ జల్లులకు జీవం పోసుకుని కళకళ్లాడుతున్నాయి. మూడు నెలలుగా మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దుక్కులు దున్ని రైతులు నిత్యం ఆకాశం వంక ఎదురు చూస్తున్నారు. ద్రోణి ప్రభావంతో నైనా పదునెక్కి వర్షాలు కురిస్తే పత్తి, పప్పుధాన్యాలు, పశుగ్రాసాల సాగుకు రైతులు సమాయత్తమయ్యే అవకాశం ఉంది.

చీరాల్లో జోరు వాన..

చీరాల: అల్పపీడన ద్రోణి ప్రభావంతో చీరాల ప్రాంతంలో శనివారం తెల్లవారు జాము నుంచి జోరువాన కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం జల్లులు కురవడంతో ప్రజలు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. ఈపురుపాలెం ప్రధాన రహదారిపై వర్షం నీరు భారీగా చేరడంతో జలమయంగా మారింది. దీనికి తోడు రోడ్డు గుంతలు ఉండటంతో రాకపోకల సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

దాతల సాయం అభినందనీయం


ఆక్సినేటర్లు అందిస్తున్న దాతలు

చినగంజాం (పర్చూరు): శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడతున్న వృద్ధులకు ఆక్సినేటర్లను దాతలు శనివారం పంపిణీ చేశారు. ఇడుపులపాడులోని ఆసరా వృద్ధాశ్రమానికి ప్రముఖ న్యాయవాది రావి సత్యనారాయణ రూ.60 వేలు విలువ కలిగిన రెండు ఆక్సినేటర్లతో పాటు అమెరికాలో ఉంటున్న తన మనవడు అధిరన్ పేరు మీద రూ.10 వేల నగదును ఆశ్రమ నిర్వాహకులు భవనం జయలక్ష్మికి అందించారు. ఇవి శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడతున్న వృద్ధులకు చాలా ఉపయోగపడతాయని దాత తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు, తోకల కృష్ణమోహన్, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, కోశాధికారి పంబి సదానందరెడ్డి, మాజీ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా


బోల్తా పడిన కారు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): కారు అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటన శనివారం సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళుతున్న కారు మార్గమధ్యంలోని సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం గ్రామ సమీపంలోకి రాగానే వేగాన్ని నియంత్రించలేక దూసుకెళ్లి బోల్తా కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఇరువురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏల్చూరు టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో అద్దంకిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన అద్దంకి తాలూకా నూతన కార్యవర్గం

అద్దంకి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అద్దంకి తాలూకా నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఆర్ అమర్‌నాథ్, సెక్రటరీగా కె. చెంచయ్య, అసోసియేటివ్ ప్రెసిడెంట్‌గా కె. వెంకటకృష్ణ, ట్రెజరర్‌గా విజయ్‌పాల్ నియమితులైనట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు.

కేసు పెట్టిందని మహిళపై దాడి

మద్దిపాడు: కేసు పెట్టిందని మహిళపై కొందరు మహిళలు దాడి చేసిన సంఘటన మద్దిపాడు మండలంలోని ఇనమనమెళ్లూరు ఎంపీసీ నగర్‌లో శనివారం జరిగింది. స్థానిక మహిళ మహేశ్వరి తన బర్రె తోక కత్తిరించారని మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు ఎందుకు పెట్టావంటూ ఆమెపై అదే కాలనీకి చెందిన టీడీపీ సానుభూతి పరులైన కొందరు మహిళలు దాడి చేసి గాయపరిచారు. గాయపడిన మహిళను ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతోంది.

ప్రయాణికులకు తప్పిన పెనుప్రమాదం


బస్సు టైరును పరిశీస్తున్న డీఎం శ్యామలకుమారి

- ఆర్టీసీ బస్సుకు ఊడిపోయిన ముందు టైరు


ముందు టైరు ఊడి పోయి నిలిచిపోయిన బస్సు

చీరాల: ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. శనివారం ఇంకొల్లు నుంచి ప్రయాణికులతో చీరాల వస్తున్న బస్సు చీరాల ముంతావారి సెంటర్ వద్దకు చేరు కొగానే పెద్ద శబ్దంతో ముందు టైరు ఊడిపోయింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును నిలుపుదల చేసి ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించారు. బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులకు మరో బస్సులో ఆర్టీసీ బస్టాండ్‌కి తరలించారు. ఘటన విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ శ్యామల కుమారి అక్కడకు చేరుకొని పరిశీలించారు. డ్రైవర్ నుంచి వివరాలు సేకరించారు. ముందు చక్రంలోని ఇనుప మాబ్ ఊడిపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని డీఎం తెలిపారు. ప్రయాణిస్తున్న బస్సు నుంచి ఒక్కసారిగా టైరు ఊడి పోవడంతో అటు బస్సులోని ప్రయాణికులతో పాటు రోడ్డుపై వెళ్తున్న పాదచారులు, ప్రజలు భయందోళన చెందారు.

జీవాల పెంపకం లాభదాయకం

- నెల్లూరు జోడిపి జాతికి డిమాండ్
- కిలో రూ.900 పలుకుతున్న మాంసం
- సూచనలిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు


జోడిపి రకం గొర్రె పొట్టేళ్లు

అద్దంకి: వాతావరణ ఆటుపోట్లతో వ్యవసాయం కలిసి రాక కొందరు జీవాల పెంపకం వైపు మొగ్గు చూపుతున్నారు. అందులోనూ రాష్ట్రంలోనే అత్యధిక డిమాండ్ ఉన్న నెల్లూరు జోడిపి జాతి గొర్రెలకు అత్యధిక ధర పలుకుతుండడంతో ఆ జీవాల పెంపకం చేపడుతున్నారు. అద్దంకి పరిధిలో 6,000 వరకు ఈ జాతి పొట్టేళ్లను పెంచుతున్నారు. పొట్టేళ్ల మాసం కేంద్ర ప్రభుత్వ మిలటరీ క్యాంపులకు సైతం ఎగుమతి అవుతోందని అద్దంకి ఏడీ మోహనరావు వివరిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని బల్లికురవ, కొరిశపాడు, జే పంగులూరు, సంతమాగులూరు, అద్దంకి మండలాల పరిధిలో సమారు 10 వేల వరకు ఈ జాతి గొర్రెలను పెంచుతున్నారు. ఈ గొర్రెల నుంచి పుట్టే పొట్టేళ్లు ఒక్కొక్కటి 45 నుంచి 50 కిలోల వరకూ మాంసం దిగుబడి రావడంతో కాపరులు బాగా పెంచుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

గత దశాబ్ద కాలం నుంచి నియోజకవర్గంలో పల్లా జాతి గొర్రెల పెంపకం ఎక్కువగా ఉండేది. క్రమేపీ వాటికి డిమాండ్ తగ్గడంతో పేరుగాంచిన జోడిపి జాతి గొర్రెల పెంపకాన్ని కాపరులు చేపట్టారు. ఇందులో క్వాలిటీ ఉన్న మాంసం అభిస్తుండడంతో పాటు, రోగాలు రావడం తక్కువగా ఉంటాయి. త్వరగా బరువు పెరిగే జాతిగా గుర్తింపు రావడంతో ఈ జాతిని కాపరులు ఎక్కువగా పెంచడానికి ఇష్టపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం జీవాలను పెంచడానికి సబ్సిడీ ఇస్తుండడంతో మరింత పెరిగింది. సకాలంలో వ్యాక్సిన్లు వేయించుకుంటే ఈ జాతి గొర్రెలకు ఎలాంటి రోగాలు సంక్రమించవని వైద్యులు చెప్తున్నారు.

తక్కువ కాలంలో వేగంగా..

జోడిపీ జాతికి చెందిన మూడు నెలల వయసు నుంచి 8 నుంచి 10 కిలోల బరువు కలిగిన పొట్టేలు పిల్లలను ఎంచుకుని పెంచుతుంటారు. మన వాతావరణానికి కూడా ఇవి తట్టుకొని వేగంగా బరువు పెరుగుతుండడంతో కాపరులు బాగా ఈ జాతిని పెంచడానికి ఇష్టపడుతున్నారు. వేగంగా పెరిగే ఈ జాతి నెలకు ఒకటిన్నర నుంచి రెండు కేజీల వరకు బరువు పెరుగుతాయి. ప్రత్యేక దాణా వేసి పెంచితే మూడు నుంచి నాలుగు కిలోల వరకు బరువు పెరిగే అవకాశం ఉ దని వైద్యులు చెప్తున్నారు.

ఎంపిక ఇలా..

ఈ జాతి గొర్రెలను నెల్లూరు జిల్లాలోని పెద్ద పెద్ద సంతల నుంచి కాపరులు కొనుగోలు చేస్తుంటారు. అయితే ఇలా కొనుగోలు చేసే పిల్లలకు ఎటువంటి రోగాలు లేనివిగా చూసుకుని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సాకలంలో వైద్యుల సలహా మేరకు టీకాలు వేయించుకోవాలి. పశు వైద్యశాలలు అందుబాటులో ఉండడంతో ఏ సలహా కావాలన్నా ఇట్టే అడిగి తెలుసుకుంటున్నారు.

లాభాలు ఇవి..

గ్రామాల్లో వరి కొతలకు ముందుగా పెసర, పిల్లిపెసర అలసంద, తదితర పంటలను సాగు చేసి, లేదా సాగు చేసిన రైతుల నుంచి ఆ పంటలను కొనుగోలు చేసి జీవాలకు వేసిపెంచటం ఆనవాయితీగా మారింది. రైతులు మూడు నెలలు కలిగిన వయసు కలిగిన పిల్లలను ఎంపిక చేసుకుని పశు గ్రాసం సాగు చేసే పొలాల్లో మేపుతారు. సుమారు ఐదు నుంచి ఆరుమాసాల పాటు మేసే జోడిపి రకం బలంగా పెరిగి అమ్మకానికి సిద్ధం అవుతుంది. ఒక్కో మందంలో 20 నుంచి 40 జీవాల వరకు పెంచడం చేస్తున్నారు. ఈ జాతి పిల్లలను ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు పొలాల్లోనే కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఒక్కో పొట్టేలును రూ.4 వేలకు కొనుగోలు చేసినా ఆరు నెలల తరువాత సుమారు 40 నుంచి 45 కిలోల వరకు పెరుగుతాయి. వీటి మాసం కిలో రూ.900 వరకు పలుతుకుతోందంటే ఈ జాతికి ఎంత డిమాండ్ ఉందో తెలుసుకోవచ్చు.

పెంపకం అధికంగా ఉంది..



ఇక్కడ జోడిపి జాతి గొర్రెల పెంపకం ఎక్కువగా చేపడుతున్నారు. గతంలో ఉన్న పల్లా రకం గొర్రెలు ఎక్కువగా వస్తుండటంతో పెంపకం దారులకు నష్టం వచ్చేది. దేశంలోని ఇతర రాష్ట్రాల పెంపకందారులు నెల్లూరు జిల్లాకు వచ్చి ఈ జాతి రకం పిల్లలను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. పెంపకందారులకు లాభాలు తెచ్చి పెట్టే ఆ జాతి జీవాల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం.

– ఏడీ మోహనరావు, అద్దంకి

మార్టూరు తాలూకా యూనిట్ ఎన్నిక ఏకగ్రీవం


ఎన్నికైన ప్రభుత్వం ఉద్యోగుల సంఘ సభ్యులు

మార్టూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా మార్టూరు తాలూకా యూనిట్ సంఘ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆటూరు తాలూకా యూత్ అధ్యక్షుడిగా ఇండేల సింగారెడ్డి, కార్యదర్శిగా పి ఆంజనేయరావు, గౌరవాధ్యక్షుడిగా జి భానుచందర్ నాయుడు, కోశాధికారిగా డి మురళీకృష్ణ, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్‌కు అవార్డులు

మార్టూరు: ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ కోలలపూడి శతాబ్దికి అవార్డులు లభించాయి. సమాజంలో పేదలకు సేవలు అందించి పలు అభివృద్ధి పథకాలు చేసిన కోలాలపూడి శతాబ్దికి పలు అవార్డులు దక్కాయి. క్లబ్ ఏర్పడిన అనతి కాలంలోనే మహిళల్లో చైతన్యం తీసుకువచ్చి పేదలకు పలు సేవలు అందించి రాష్ట్రంలోనే ముందంజలో ఉండటంతో తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌లో శుక్రవారం జరిగిన క్లబ్ కార్యక్రమంలో ఉత్తమ అధ్యక్షురాలుగా కందిమల్ల నిర్మలకు డిస్ట్రిక్ట్ 315 అసోసియేషన్ అధ్యక్షురాలు సునీత జైన్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కోలా విజయలక్ష్మి నుంచి అవార్డు స్వీకరించారు. దీనితోపాటు క్లబ్ 71 ప్రాజెక్టులు పూర్తి చేసినందుకుగాను 11 ఉత్తమ సర్టిఫికెట్లు ప్రదానం చేసి క్లబ్ సభ్యులను ప్రశంసించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు కందిమల్ల నిర్మల సెక్రటరీ శివకుమారి, అరుణ కుమారి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మురుగు కాల్వ గుంతలు

- గుంతల్లోపడి గాయాలపాలవుతున్న వాహనదారులు
- పట్టని మున్సిపల్ అధికారులు


సురేష్‌మహల్ వద్ద ప్రమాదకరంగా మారిన మురుగు కాలువ


మోహన్ థియేటర్ వద్ద ఇలా..

చీరాల రూరల్: పట్టణంలోని పలు మురుగు కాలువలు ప్రమాదభరితంగా మారాయి. ప్రమాదవశాత్తు వాహనదారులు ఆ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. నెలల తరబడి ఆయా కాలువలపై గుంతలు ఉన్నప్పటికి మున్సిపాలకులు పట్టీపట్టనట్లు వ్యవరిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదదం సంభవిస్తుందోనని వాహనదారులు హడలెత్తిపోతున్నారు. పట్టణంలోని చిన్న మార్కెట్ సెంటర్ నుంచి సురేష్‌మహల్‌కు వెళ్లే రోడ్డు మూల మలుపు వద్దనున్న మురుగు కాలువ కూడలి కొన్ని రోజులుగా ప్రమాదకరగా మారింది. ఆ కాలువ ఉన్న ప్రదేశంలో పనులు జరుగుతుండడంతో వ్యర్థాలతో కూడిన మట్టి దిబ్బలు అలాగే వదిలేశారు. దానికితోడు మూల మలుపు కావడంతో రాత్రి సమయంలో వాహనదారులు ఆ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. అలానే మోహన్ థియేటర్, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పార్కు సమీపంలోని మురుగు కాలువలు ప్రమాదభరితంగా మారాయి. ఇవేకాక పట్టణంలోని అనేక ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇకనైనా మున్సిపల్ అధికారులు మురుగు కాలువల వద్దనున్న గుంతలను పూడ్చివేసి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.